సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 29 । జనవరి । 2024



హైస్పీడ్‌కు గన్స్‌తో బ్రేక్

వాహనాల అతివేగాన్ని నియంత్రించేందుకు జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రహదారులపై స్పీడ్ గన్ పరికరాలను ఏర్పాటుచేశారు. 8లో



దేవినేనివారిగూడెంలో పెద్దపులి

ద్వారకాతిరుమల మండలం దేవినేనివారిగూడెంలో పశువులపై పెద్దపులి దాడి చేసింది. రెండు ఆవులు, ఒక దూడ గాయపడ్డాయి. 8లో



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు పెదపాడు మండలం పాత ముప్పర్రుకు చెందిన గొట్టపు లియాన్స్‌శ్రీ రూ.2,11,116ను విరాళంగా అందజేశారు.

సాగు చట్టం.. కౌలు రైతుకు పట్టం

'కౌలు'కునేలా..

- కౌలు రైతుకు భరోసా
- సాగుచట్టం సవరణతో పెరిగిన సీసీఆర్‌సీ కార్డులు
- జిల్లాలో లక్ష్యానికి మించి జారీ
- కౌలు రైతులకూ అన్ని పథకాల వర్తింపు
- అత్యధికంగా రూ.317 కోట్ల పంట రుణాల మంజూరు



సాక్షి, భీమవరం: సాగులో కష్టం వస్తే కుదేలైపోయే కౌలు రైతులకు కొండంత అండగా నిలిచింది జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు. సాగు చట్టంలో సవరణలు తీసుకువచ్చి భూ యజమానుల్లో అపోహలను నివృత్తి చేసింది. అధిక శాతం మంది కౌలు రైతులకు క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డ్ (సీసీఆర్‌సీ) జారీ ద్వారా అసలు రైతుల మాదిరి ప్రభుత్వ పథకాలు అందించేందుకు మార్గం సుగమం చేసింది. ప్రభుత్వ చొరవతో జిల్లాలో లక్ష్యానికి మించి ఈ సీజన్‌లో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను అధికారులు అందించారు.

జిల్లాలో లక్ష మంది వరకూ..

జిల్లాలో వరి పండించే రైతులు సుమారు మూడు లక్షల మంది వరకు ఉండగా వారిలో లక్ష మంది కౌలు రైతులు ఉన్నారు. సాధారణ రైతుల మాదిరిగా వీరికి రుణాలు, రాయితీలు, వడ్డీ మాఫీ పథకాలు, పంట నష్టపరిహారం అందేవి కాదు. దీంతో అయినకాడికి అప్పులు చేసి పంటలు సాగు చేయడం, ప్రకృతి వైపరీత్యాలు, పంట తెగుళ్లతో నష్టం వాటిల్లితే రుణ ఊబిలో కూరుకుపోవడం జరిగేది. ఈ నేపథ్యంలో కౌలుదారుల కష్టాలు గుర్తించిన దివంగత వైఎస్సార్ ఆదుకునేందుకు చర్యలు చేపట్టారు. జాయింట్ లయిబులిటీ గ్రూపులు (జేఎల్‌జీ) ఏర్పాటుచేసి కౌలు రైతులు సంఘాలకు రుణ సదుపాయం కల్పించారు. ఆయన మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు జేఎల్‌జీని అటకెక్కించాయి. 2011లో ప్రభుత్వం కౌలు చట్టం తెచ్చినా కౌలుదారుని సమాచారంతో పాటు కౌలు తాలుకు భూమి వివరాలు నిక్షిప్తం చేయాలని నిబంధన పెట్టింది. భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న ఆందోళనతో వివరాలు తెలిపేందుకు అసలు రైతులు ముందుకు రాక ఆశించిన ప్రయోజనం నెరవేరలేదు. అరకొర మందికి గుర్తింపు కార్డులిచ్చినా అసలు రైతు పంట రుణం తీసుకుంటే కౌలురైతులకు ఇచ్చేవారు కాదు.

చట్టాన్ని సవరించిన జగన్ సర్కారు

అసలు రైతుల మాదిరి కౌలు రైతులను అన్నివిధాలా ఆదుకుంటానని ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీని అధికారంలోకి రాగానే అమలుచేశారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. భూయజమానుల హక్కులకు భంగం కలుగకుండా 11 నెలల కాలానికి సాగు ఒప్పందాలు చేసుకునే విధంగా 2011 కౌలు చట్టంలో సవరణలు తీసుకువచ్చారు. ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించి ఒకసారి జారీచేసిన కార్డును మరలా యజమాని అంగీకారం మేరకు రెన్యూవల్ చేసుకునే వీలు కల్పించారు. భూ యజమానుల్లో అపోహలు తొలగడంతో జిల్లాలో సీసీఆర్‌సీ కార్డుదారుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

లక్ష్యానికి మించి కార్డులు

2023–24 సీజన్‌కు గాను జిల్లాలో లక్ష్యానికి మించి కౌలురైతులకు గుర్తింపు కార్డులు జారీచేశారు. భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం డివిజన్ పరిధిలో మొత్తం 84,185 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీచేయాల్సి ఉండగా 89,589 మందికి కార్డులు జారీచేశారు. అసలు రైతుల మాదిరి కౌలు రైతులకు రూ.317 కోట్లు పంట రుణాలను అందించారు. వీరికీ రైతు భరోసా, పంటల బీమా పరిహారం పథకాలు అందించి ఆదుకుంటున్నారు.

జిల్లాలో కౌలు గుర్తింపు కార్డుల జారీ

మండలం	లక్ష్యం	జారీ
ఆకివీడు	2,501	2,573
భీమవరం	2,943	3,021
కాళ్ల	1,686	1,761
పాలకోడేరు	4,156	4,605
ఉండి	3,525	3,778
వీరవాసరం	5,110	5,579
గణపవరం	3,484	3,991
అత్తిలి	5,505	5,688
పెంటపాడు	6,327	6,774
తాడేపల్లిగూడెం	5,747	6,477
ఇరగవరం	6,519	6,891
తణుకు	4,658	4,806
ఆచంట	6,182	6,479
యలమంచిలి	2,572	2,810
మొగల్తూరు	512	536
నరసాపురం	1,806	2,067
పాలకొల్లు	3,778	3,978
పెనుగొండ	5,985	6,165
పెనుమంట్ర	5,222	5,428
పోడూరు	5,967	6,182
గుర్తింపు కార్డుల జారీ లక్ష్యం		84,185
కౌలు రైతులకు జారీ చేసిన కార్డులు		89,589

రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో..



జిల్లాలో లక్ష్యానికి మించి కౌలు గుర్తింపు కార్డులు జారీ చేశాం. కౌలు రైతులకు పంట రుణాల మంజూరులో జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు రూ.317 కోట్లు పంట రుణాలిచ్చాం. గతంతో పోలిస్తే చట్టం సవరణ తర్వాత కౌలు గుర్తింపు కార్డులు జారీకి అసలు రైతులు ముందుకు వస్తున్నారు.

– జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ జేడీ, భీమవరం

ఏటా గుర్తింపు కార్డు



30 ఏళ్లకు పైగా కౌలుకు వ్యవసాయం చేస్తున్నా. సీఎం జగన్ వచ్చినప్పటి నుంచి ప్రతిఏటా కౌలు గుర్తింపు కార్డు ఇస్తున్నారు. నవరత్నాల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు భరోసా ఏడాదికి రూ.13,500 నా ఖాతాలో జమవుతోంది. దీంతో పెట్టుబడి ఖర్చులకు ఎక్కువ మొత్తం అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన అవసరం ఉండటం లేదు. సీఎం జగన్ సాయం భరోసా ఇస్తోంది.

– గోగులమండ జయరావు, జిన్నూరు

ఈ ప్రభుత్వంలోనే కార్డు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే కౌలురైతు గుర్తింపు కార్డు ఇచ్చారు. గతంలో ఏ ప్రభుత్వం మమ్మల్ని గుర్తించలేదు. ఈ ప్రభుత్వంలో తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేయడంతో పాటు రైతు భరోసా పథకం కింద రూ.13,500 ఏటా నా ఖాతాలో జమచేస్తున్నారు. ఇప్పుడు కౌలు రైతుకు గుర్తింపు రావడం చాలా సంతోషం. జగనన్న ప్రభుత్వం మరలా రావాలి.

– చికిలే స్వాతి, కుముదవల్లి, పాలకోడేరు మండలం

న్యూస్‌రీల్

3న వైఎస్సార్‌సీపీ సన్నాహక సభ

పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని

ఏలూరు టౌన్‌: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ పార్టీ క్యాడర్‌కు దిశానిర్దేశం చేసేందుకు చేపట్టిన ఎన్నికల సన్నాహక భారీ సభను వాయిదా వేసినట్టు పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని తెలిపారు. ఫిబ్రవరి 3న మధ్యాహ్నం 2 గంటలకు సన్నాహక సభను నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనివార్య కారణాలతో ఫిబ్రవరి 1న జరగాల్సిన సభను వాయిదా వేశామని చెప్పారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ నేతలు, శ్రేణులు, అభిమానులతో 2024 సార్వత్రిక ఎన్నికల సన్నాహక సభ భారీఎత్తున నిర్వహించేందుకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారని తెలిపారు. పార్టీ నేతలు, క్యాడర్ సభ మార్పును గమనించాలనీ, ఫిబ్రవరి 3న (శనివారం) జరిగే సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పన్ను వసూళ్లలో జిల్లా ప్రథమం

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం (ప్రకాశంచౌక్): పంచాయతీలకు సంబంధించి పన్ను వసూళ్లలో పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఆదివారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ 2023–24కి సంబంధించి జిల్లా పన్ను వసూళ్ల లక్ష్యం రూ.30.49 కోట్లకు గాను ఇప్పటివరకు రూ.10.34 కోట్లు వసూలుచేసి 34 శాతంతో రాష్ట్రంలో ముందంజలో ఉన్నామన్నారు. జిల్లాలో పాలకొల్లు మండలం 61 శాతంతో ప్రథమ, పోడూరు మండలం 59 శాతంతో ద్వితీయ, యలమంచిలి మండలం 53 శాతంతో తృతీయ స్థానాల్లో నిలిచాయన్నారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి రూ.12.20 కోట్లకు గాను రూ.11.50 కోట్లు ఖర్చుచేశామన్నారు. రెండో విడత ఆర్థిక సంఘం నిధులు రూ.24 కోట్లను మార్చి 15 నాటికి ఖర్చుచేయాలని, మౌలిక వసతుల కల్పనలో భాగంగా ముఖ్యంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలని ఎంపీడీఓలకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

వేమూరికి కవితా పురస్కారం



తాడేపల్లిగూడెం (టీఓసీ) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మనది గాంధేయం–రావాలి గాంధీ యుగం అనే అంశంపై నిర్వహించిన కవితల పోటీలో ఏపీ అధికార భాషా సంఘం గిడుగు రామ్మూర్తి పంతులు పురస్కార గ్రహీత, ఏపీ సాహిత్య అకాడమీ సాహితీ పురస్కార గ్రహీత, సాహితీవేత్త వేమూరి శ్రీనివాస్ (తాడేపల్లిగూడెం) రాసిన కవిత 'ఆకాంక్ష' జిల్లా స్థాయి బహుమతికి ఎంపికైంది. ఈనెల 30న పెదనింద్రకొలను గాంధీ భవనంలో జరిగే గాంధీ వర్ధంతి కార్యక్రమంలో ఆయనకు బహుమతి అందజేయనున్నారు.

రోప్ స్కిప్పింగ్ పోటీలు



భీమవరం : అంతర్ జిల్లాల 67వ స్కూల్‌గేమ్స్ రోప్ స్కిప్పింగ్ పోటీలు భీమవరం చింతలపాటి బాపిరాజు పాఠశాలలో ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే పోటీల్లో అండర్ 14, 17, 19 విభాగాల్లో బాలురు, బాలికలు తలపడనున్నారు. 13 జిల్లాల నుంచి 405 మంది క్రీడాకారులు హాజరయ్యారని పోటీల కన్వీనర్ జీపీసీ శేఖర్ రాజు తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వేల్పూరులో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్‌: తణుకు మండలం వేల్పూరు గ్రామంలో సత్యనారాయణస్వామి గుడి ప్రాంతానికి చెందిన మహిళలు ఆదివారం ప్రజాదీవెన పాదయాత్ర చేస్తున్న రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీకి చెందిన సుమారు 200 మంది మహిళలు మంత్రి కారుమూరి సమక్షంలో పార్టీలో చేరగా ఆయన కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

ముఖ్యమంత్రి సభకు ముమ్మర ఏర్పాట్లు

3న సీఎం జగన్ దెందులూరు రాక



దెందులూరులో స్థలాన్ని పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: దెందులూరు సహారా గ్రౌండ్స్‌లో వచ్చేనెల 3న జరిగే తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల వైఎస్సార్‌సీపీ సన్నాహక సభ ఏర్పాట్లను సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు ఆదివారం పరిశీలించారు. సహారా గ్రౌండ్ చదును, టెంట్లు, సభాస్థలి ఏర్పాట్లను వారు పరిశీలించి సూచనలు చేశారు. వేగంగా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తిచేయడంతో పాటు పర్యవేక్షణ సైతం నిర్విరామంగా జరగాలని ఆయా విభాగాల ప్రతినిధులకు తలశిల రఘురాం సూచించారు. వైఎస్సార్‌సీపీలోని అన్ని విభాగాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమన్వయంతో సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ పాలనలో చేసిన సంక్షేమం, అభివృద్ధి ప్రజల గుండెల్లో ఉందని, కృతజ్ఞతగా వారంతా ముఖ్యమంత్రి వైపు ఉన్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, బీసీ సెల్ అధ్యక్షుడు ప్రసాదరావు సన్నాహక సభ ఏర్పాట్లపై ఆయనతో చర్చించారు.

ఐజీ, ఎస్పీతో సమీక్ష

సీఎం సభాస్థలిలో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్, ఎస్పీ డి.మేరీ ప్రశాంతితో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సమీక్షించారు. వాహనాల రాకపోకలు, పార్కింగ్, వీఐపీ పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు సీఎం సభాస్థలి, హెలీప్యాడ్, ట్రాఫిక్ ఇతర అంశాలపై ఐజీ సమీక్షించారు. ఎమ్మెల్యేకు పలు అంశాలపై సీఎం జగన్ భద్రతా దృష్ట్యా సభ నిర్వహణ కోసం సూచనలు చేశారు.

సార్వత్రిక సమరానికి సిద్ధం కావాలి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

తాడేపల్లిగూడెం : రానున్న సార్వత్రిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఉత్తరాంధ్రలో యుద్ధానికి సిద్ధమంటూ సమరభేరి మోగించారని, నియోజకవర్గం నుంచి కూడా సిద్ధమవుదామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబం ఆర్థికంగా లబ్ధి పొందిందని, వచ్చే ఎన్నికల్లో మరలా పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఉత్తరాంధ్రలో జరిగిన సిద్ధం సభకు అశేషంగా తరలివచ్చిన ప్రజలను చూసి ప్రతిపక్షాల వెన్నులో వణుకు పుట్టిందన్నారు. సీఎం జగన్ ఆధ్వర్యంలో జరిగే సిద్ధం సభలకు పెద్దఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు జరిగిన మేలు భవిష్యత్తులో కొనసాగాలని, జగన్ నాయకత్వంలో మళ్లీ ప్రభుత్వం కొలువుదీరాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. వచ్చేనెల 3న దెందులూరులో జరిగే సిద్ధం సభకు భారీ ఎత్తున తరలివెళ్లేలా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. ఎవరు ఏ బాధ్యత తీసుకోవాలనే విషయంపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ పసల కనకసుందరరావు, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, ఎంపీపీ దాసరి హైమావతి, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కర్రి భాస్కరరావు, బొడ్డు సాయిబాబా, కొలుకులూరి ధర్మరాజు, గుండు మోగుల బలుసులరావు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు సబ్ కలెక్టర్ బదిలీ

ఏలూరు (మెట్రో) : నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆదర్శ్ రాజేంద్రన్ జిల్లాల విభజన అనంతరం నూజివీడు సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత బదిలీల్లో భాగంగా ఆయన్ను నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. అలాగే పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ 2017 బ్యాచ్‌కు చెందిన ప్రవీణ్ ఆదిత్యను కాకినాడ జాయింట్ కలెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. ఆ స్థానంలో ఇల్లకియాను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

నాట్లు ముమ్మరం

1.13 లక్షల ఎకరాల్లో పూర్తి



భీమవరం: జిల్లాలో దాళ్వా వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సార్వా పంటలో మంచి దిగుబడులు సాధించిన రైతులు దాళ్వా పంటపై ప్రత్యేక దృష్టి సారించి నాట్లు పనుల్లో బిజీగా ఉన్నారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో 2.23 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేయాల్సి ఉండగా ఇప్పటివరకు దాదాపు 1.13 లక్షల ఎకరాల విస్తీర్ణంలో నాట్లు పూర్తి చేశారు. సాగునీటి ఎద్దడి లేకుండా నీటిపారుదల శాఖాధికారులు చర్యలు తీసుకోవడంతో రైతులు చేలను దమ్ము చేయించి నాట్లు వేసే పనుల్లో ఉన్నారు. ప్రస్తుత దాళ్వా సీజన్‌కు రైతులు ఎక్కువగా ఎంటీయూ 1121, ఎంటీయూ 1153, ఎంటీయూ 1156, పీఆర్ 126 రకాలను నాట్లు వేస్తుండగా ఇప్పటికే తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు మండలాల్లో నాట్లు దాదాపు పూర్తయ్యాయి. నరసాపురం, ఆకివీడు, పాలకొల్లు మండలాలు బాగా వెనుకబడి ఉన్నాయి. ఫిబ్రవరి మొదటి వారం నాటికి నాట్లు పూర్తిచేసేలా అధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు.

58,800 టన్నుల ఎరువులు అవసరం

దాళ్వా సీజన్‌కు అవసరమైన ఎరువులను ఇప్పటికే అందుబాటులో ఉంచారు. జిల్లాలోని 2.23 లక్షల ఎకరాలకు 58,800 టన్నుల ఎరువులు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. దీనిలో ముందుగా 5,257 టన్నులు రైతు భరోసా కేంద్రాలు, 7,239 టన్నులు వ్యవసాయ సహకార సంఘాల్లో అందుబాటులో ఉంచారు. రైతులు ఎక్కువగా వరిపైరుకు వినియోగించే యూరియా, డీఏపీ, పొటాష్ తదితర ఎరువులను సిద్ధం చేశారు. రైతుల అవసరాల మేరకు ఎప్పటికప్పుడు ఎరువులను ఆర్‌బీకే, సొసైటీల్లో సిద్ధం చేసేలా చర్యలు తీసుకున్నారు.

ఎరువులు సిద్ధం

జిల్లావ్యాప్తంగా వరినాట్లు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 50 శాతం వరకు నాట్లు పూర్తిచేశారు. సార్వా మాసూళ్లు వర్షాల కారణంగా జాప్యం కావడంతో దాని ప్రభావం దాళ్వా నాట్లపై పడింది. ఫిబ్రవరి మొదటి వారం నాటికి నాట్లు పూర్తిచేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. రైతులకు ఎరువులు సిద్ధంగా ఉన్నాయి.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, భీమవరం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. మండలంలోని ఓడూరు, ఆలమూరు, వెలగలేరు గ్రామాల్లో రూ.2.72 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయ భవనాలను మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా అర్హులను గుర్తించి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. ప్రతి గ్రామంలో విద్యా, వైద్య సదుపాయాలను మెరుగుపర్చేందుకు అధునాతన సౌకర్యాలతో భవనాలు నిర్మిస్తున్నారన్నారు. ఆచంట నియోజకవర్గంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా అందుబాటులో ఉండే ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజును మరోసారి గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, వైఎస్సార్‌సీపీ పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపి, ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి, జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి, ఏఎంసీ మాజీ చైర్మన్ మేడపాటి చంద్రమౌళీశ్వరరెడ్డి, దంపనబోయిన బాబూరావు, సీనియర్ నాయకులు పెన్మెత్స విశ్వనాథరాజు, పలివెల శ్రీనివాస్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైనాట్‌లో ఆఫర్ల ఉత్సవం



ఆఫర్ల బ్రోచర్ విడుదల చేస్తున్న వైనాట్ అధినేత వెంకట్రాయుడు

తణుకు: రాష్ట్రంలో ఉత్తమ గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్ స్టోర్స్ వైనాట్‌లో 30వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈనెల 29 నుంచి ఏప్రిల్ 9 వరకు ఆఫర్ల ఉత్సవం నిర్వహించనున్నట్టు వైనాట్ అధినేత జుజ్జవరపు వెంకట్రాయుడు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 31 షోరూంలలో రూ.50 లక్షల విలువ చేసే 1,116 బహుమతులు అందజేస్తామన్నారు. 2022, 2023లో బెస్ట్ టైం బిజినెస్ అవార్డు, ఆసియా టుడే వారిచే ప్రైడ్ ఆఫ్ నేషనల్ అవార్డు పొందిన తమ సంస్థలో ఆన్‌లైన్ కంటే తక్కువ ధరలకు ఉత్పత్తులను అందిస్తున్నామన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

ముసునూరు: యువకులను, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పి.వాసు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఏలూరు నుంచి నూజివీడుకు కాట్రేనిపాడు మీదుగా గంజాయిని ఆటోలో తరలిస్తున్న నలుగురు యువకులను పట్టుకుని, ముసునూరు స్టేషన్‌కు తరలించారు. వీరిలో ముగ్గురు నూజివీడుకు, ఒకరు ముసునూరుకు చెందినవారిగా గుర్తించారు. వీరి నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంక్షేమ శకం



ప్రభుత్వ పథకాలు ఆదుకున్నాయి



ప్రభుత్వ పథకాలు మా కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్నాయి. నా భర్త డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో మా అబ్బాయికి అమ్మ ఒడి పథకంతో పాటు జగనన్న విద్యా కానుక అందుతోంది. నేను డ్వాక్రా సంఘంలో ఉండటం వల్ల వైఎస్సార్ ఆసరా ద్వారా నాలుగేళ్లుగా రూ.16,500 చొప్పున నా బ్యాంక్ అకౌంట్‌లో జమైంది. కుప్పనపూడి శివారు తాళ్లకోడులో జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. అందులో ఇల్లు నిర్మించుకుంటున్నాం. ప్రభుత్వం నుంచి రూ.1.80 లక్షలతో పాటు, డ్వాక్రా రుణం పొంది ఇల్లు నిర్మాణం వేగంగా పూర్తి చేసుకుంటున్నాం. మా అత్తగారు మా ఇంటి వద్దే ఉంటున్నారు. ఆమెకు వితంతు పింఛన్ అందుతోంది. ఈ నెల నుంచి రూ.3 వేల పింఛన్ సొమ్ము ఇంటికి వచ్చి ఇస్తున్నారు.

– దావులూరి వనజ, సిద్ధాపురం, ఆకివీడు మండలం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



గతంలో చంద్రబాబు చెప్పిన మాటలు విని బ్యాంకులకు రుణాలు చెల్లించలేదు. టీడీపీ హయాంలో రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకుల్లో తీసుకున్న అప్పు, వడ్డీ కలిపి మోయలేని భారంగా మారాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వరుసగా నాలుగో విడత వైఎస్సార్ ఆసరా నిధుల మంజూరు చేశారు. దీంతో అప్పు తీరిపోయింది. విఘ్నేశ్వర గ్రూపులో మేం పది మంది సభ్యులం ఉన్నాం. రూ.4 లక్షల అప్పు తీసుకుంటే ఒక్కొక్క విడతలో రూ.1 లక్ష చొప్పున వచ్చాయి. మహిళలు ఎల్లప్పుడు సీఎం జగన్‌కు రుణపడి ఉంటారు.

– బి.పార్వతి, వింజరం, కైకలూరు

'ఆసరా' ఆర్థికంగా ఆదుకుంది



వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా గత నాలుగు దఫాలుగా రుణమాఫీ నగదు అందుకున్నాను. పూర్తి స్థాయిలో రుణమాఫీ జరగడమే కాక, ఆ డబ్బు మా కుటుంబాన్ని ఆర్థికంగా ఎంతో ఆదుకుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు బ్యాంకులకే డబ్బులు కట్టొద్దన్నాడు. మళ్లీ మేమే అధిక వడ్డీలకు అప్పులు చేసి కట్టక తప్పలేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చిన మాకు జగనన్నే కావాలి.

– ఎన్.వరలక్ష్మి, దొంగపిండి, భీమవరం మండలం

హైస్పీడ్‌కు గన్స్‌తో బ్రేక్

మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదాలకు బలైపోతున్నవారు ఎందరో. కుటుంబానికి ఆధారమైన వ్యక్తినో కోల్పోతే వారికి తీరని నష్టం కలగడమే కాక ఎంతో మనోవేదన తప్పదు. ఈ నేపథ్యంలో వాహనాల మితిమీరిన వేగాన్ని నియంత్రించేందుకు జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఏలూరు జిల్లా పరిధిలో స్పీడ్ గన్ పరికరాలను ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని కొలవడమే కాక మితిమీరిన వేగంతో వెళ్లే వాహనాలను గుర్తిస్తూ వారికి జరిమానా విధిస్తున్నారు. అలాగే జాతీయ, రాష్ట్ర రహదారుల్లో బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి, ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.



ఏలూరు రూరల్ పరిధిలోని హైవేపై స్పీడ్ గన్‌తో వాహనాల వేగాన్ని పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

- హైవే, రాష్ట్ర రహదారుల్లో వాహనాల వేగంపై డిజిటల్ నిఘా
- రోడ్డు ప్రమాదాలపై స్పెషల్ డ్రైవ్.. వేగం మితిమీరితే కేసులు
- ఏలూరు జిల్లా పరిధిలో 34 ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు
- సిద్ధంగా 9 హైవే పెట్రోలింగ్ బృందాలతో సహాయక చర్యలు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలోని జాతీయ, రాష్ట్ర రహదారుల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకునే 34 బ్లాక్ స్పాట్స్‌ను జిల్లా అధికారులు గుర్తించారు. అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో బారికేడ్లు, స్టాపర్లు ఏర్పాటు చేస్తూ నిత్యం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టారు. ఏలూరు పరిధిలో ఆశ్రం హాస్పిటల్ జంక్షన్, రత్నాస్ హోటల్, దెందులూరు పరిధిలో సత్యనారాయణపురం ఎక్స్ జంక్షన్, కొవ్వలి బ్రిడ్జి, గుండుగొలను, భీమడోలు పరిధిలో రైల్వేగేటు, అయ్యప్పస్వామి గుడి, పూళ్ల, ద్వారకాతిరుమల పరిధిలో ఎం.నాగులపల్లి, గుణ్ణంపల్లి, చేబ్రోలు పరిధిలో కైకరం సెంటర్, ఉంగుటూరు, నారాయణపురం, జంగారెడ్డిగూడెం పరిధిలో తాడువాయి సెంటర్, జల్లేరు వాగు, వేగవరం సెంటర్, నూజివీడు పరిధిలో ఎంఆర్ అప్పారావు కాలనీ ఎక్స్ రోడ్డు, తుక్కులూరు సెంటర్, ఇక స్టేట్ హైవేలో తడికలపూడి, రాఫిన్ టవర్స్ వంటి ప్రాంతాలు ఉన్నాయి.

7 స్పీడ్ గన్స్‌తో తనిఖీ

ఏలూరు జిల్లాలో జాతీయ రహదారుల్లో వాహనాల వేగం నియంత్రణకు స్పీడ్ గన్స్‌తో బ్రేకులు వేసేలా ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం 7 స్పీడ్ గన్స్ ఉండగా, రెండు స్పీడ్ గన్స్‌తో పోలీస్, రవాణా శాఖ సంయుక్తంగా జాతీయ రహదారుల్లో వాహనాల వేగాన్ని తనిఖీ చేస్తూ మితిమీరిన వేగంతో ప్రయాణించే వాహనాలకు ఈ-చలానా వేస్తున్నారు. ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపే వారికి రవాణాశాఖ ఈ-చలానా సైట్ నుంచి ఫైన్స్ వేస్తున్నారు. ఇలా సత్యనారాయణపురం బ్లాక్ స్పాట్ వద్ద ఐదు కేసులు నమోదు చేయగా, ఏలూరు రూరల్ పరిధిలో రత్నాస్ హోటల్ వద్ద ఎనిమిది కేసులు నమోదు చేశారు.

జిల్లాలో గత మూడేళ్లలో రోడ్డు ప్రమాదాలు ఇలా..

సంవత్సరం	ప్రాణాంతకమైనవి	ప్రాణాంతకం కానివి
2021	251	367
2022	244	389
2023	256	377

క్షతగాత్రుల రక్షణకు ప్రాధాన్యం

రోడ్డు ప్రమాదాలను నియంత్రించటంతోపాటు ప్రమాదాలు చోటుచేసుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని హాస్పిటల్స్ తరలించి ప్రాణాలను రక్షించేందుకు పోలీస్ యంత్రాంగం ప్రాధాన్యం ఇస్తోంది. ఏలూరు జాతీయ రహదారి 216పై, రాష్ట్ర రహదారుల్లోనూ 9 హైవే సేఫ్టీ వాహనాలు పనిచేస్తున్నాయి. ఒక్కో వాహనంపై రెండు షిఫ్టులలో నలుగురు పోలీస్ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



జాతీయ రహదారుల్లో మితిమీరిన వేగంతో వాహనాలను నడపటం ద్వారా అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదాలను నివారించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం. పోలీస్, రవాణా శాఖ సంయుక్తంగా స్పీడ్‌గన్స్‌తో వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టాం. వేగం కంటే మనిషి ప్రాణం విలువైందనీ, కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని క్షేమంగా గమ్యస్థానాలకు చేరాలని అవగాహన కల్పిస్తున్నాం. రాత్రి వేళల్లో లారీ డ్రైవర్లకు వాష్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపడుతున్నాం. వేగాన్ని నియంత్రించేలా స్టాపర్లు ఏర్పాటు చేయటం, హైవే పెట్రోలింగ్ వంటివి నిర్వహించేలా శ్రద్ధ వహిస్తున్నాం.

– డీ మేరీ ప్రశాంతి, ఏలూరు జిల్లా ఎస్పీ

దేవినేనివారిగూడెంలో పెద్దపులి



దేవినేనివారిగూడెంలో రైతులతో మాట్లాడుతున్న అటవీ అధికారులు



పులి దాడిలో గాయపడ్డ ఆవు



ముండూరులో పెద్ద పులి కదలికలపై చర్చిస్తున్న అటవీ శాఖాధికారులు

- తోటలో కట్టి ఉన్న 2 ఆవులు, ఒక దూడపై దాడి
- గ్రామంలో రైతులతో మాట్లాడిన అటవీ శాఖ అధికారులు

ద్వారకాతిరుమల: గత కొద్ది రోజులుగా ఉభయ గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న పెద్ద పులి శనివారం అర్ధరాత్రి ద్వారకాతిరుమల మండలం దేవినేనివారిగుడెంలోకి ప్రవేశించింది. ఒక తోటలో కట్టి ఉన్న పశువులపై దాడి చేయడంతో రెండు ఆవులు, ఒక ఆవు దూడ తీవ్రంగా గాయపడ్డాయి. విషయం తెలుసుకున్న రైతులు, గ్రామస్తులు పులి భయంతో వణికిపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన రైతు పాకలపాటి మధు రోజులానే పశువులను తన ఆయిల్ పామ్ తోటలో శనివారం సాయంత్రం కట్టేశాడు. తిరిగి పాలు తీసేందుకు ఆదివారం తెల్లవారుజామున తోటలోకి వెళ్లాడు. అయితే ఒక ఆవు కట్లు తెంచుకుని దూరంగా బెదురుగా ఉండడాన్ని గుర్తించి దగ్గరకు వెళ్ళి చూడగా ఆవు శరీరంపై గాయాలు కనిపించాయి. అలాగే మరో ఆవు, దూడ శరీరాలపై కూడా గాయాలు ఉండటం, ఆ ప్రాంతంలో పులి పాదముద్రలు ఉండటంతో భీతిల్లి ఈ విషయాన్ని స్థానిక రైతులకు, అటవీశాఖ అధికారులకు తెలిపాడు. దీంతో అటవీ శాఖ రాజమండ్రి సర్కిల్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో త్రిమూర్తుల రెడ్డి, ఏలూరు జిల్లా డీఎఫ్‌వో రవీంద్ర ధామా, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ పశువులను పరిశీలించారు. పులి పంజాతో కొట్టడం వల్ల ఏర్పడిన గాయాలేనని అధికారులు నిర్ధారించారు. అలాగే పులి పాదముద్రలను సేకరించారు. ఈ సందర్భంగా గ్రామంలో మైక్ ద్వారా ముందస్తులు హెచ్చరికలు చేయించారు. పులి సంచారం నేపథ్యంలో దేవినేనివారిగూడెం, రామన్నగూడెం, చుట్టుపక్కల గ్రామస్తులెవరూ ఒంటరిగా బయట తిరగొద్దని, పొలాలకు వెళ్లేవారు గుంపులుగా వెళ్లాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరికైనా పులి లేదా, దాని జాడ కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా సర్కిల్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో త్రిమూర్తులరెడ్డి మాట్లాడుతూ పాదముద్రల ఆధారంగా పులి కదలికలను గుర్తిస్తున్నామని, దీనిని పట్టుకునేందుకు మూడు బృందాలతో గాలిస్తున్నట్టు తెలిపారు. పులి దాడిలో పశువులు గాయపడ్డా, మృతి చెందిన బాధిత రైతుకు నష్టపరిహారం అందిస్తామన్నారు. ఒకవేళ పులి కనిపిస్తే దాడులు చేయొద్దన్నారు. దాడులకు పాల్పడే వారిపై వైల్డ్ యానిమల్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముండూరులో పులి పాదముద్రల పరిశీలన

పెదవేగి/దెందులూరు: పెదవేగి మండలం ముండూరు, దెందులూరు మండలం మేదినవారి పాలెం గ్రామాల్లో పులి సంచారంపై ఆదివారం అటవీ అధికారులు పరిశీలన చేశారు. డీఎఫ్ఓ రవీంద్ర ధామ, వైల్డ్ లైఫ్ చీఫ్ వార్డెన్ ఏకే నాయక్, రాజమహేంద్రవరం ముఖ్య అటవీ సంరక్షణాధికారి వై.శ్రీనివాసరెడ్డి, రాజమహేంద్రవరం డీఎఫ్ఓ ఎ.త్రిమూర్తులు రెడ్డి ఈ గ్రామాల్లో పులి తిరిగిన ప్రదేశాలను తనిఖీ చేశారు. పులి కదలికలను గుర్తించేందుకు సమీప గ్రామాలలోని ప్రజలకు, పశువులకు హాని జరుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. పెరుగుగూడెంలో పాదముద్రలను పరిశీలించామని, అవి పెద్దపులివిగా ప్రాథమికంగా నిర్ధారించామని జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రధామ వివరించారు. పెద్దపులి కదలికలపై సమాచారం తెలిస్తే అటవీశాఖ టోల్ ఫ్రీ నంబర్ 1800–425–5909 కు తెలియజేయాలని కోరారు. సామాజిక మాధ్యమాలలో పులిపై వస్తున్న ప్రచారాలను నమ్మవద్దని ప్రజలను కోరారు.

రెండో రోజు కొనసాగిన బైబిల్ మహాసభలు



బైబిల్ మిషన్ మహాసభలకు హాజరవుతున్న పాస్టర్లు

ఉంగుటూరు: మానవుడు పాపాలు చేయకుండా దేవుడు క్లాం వేస్తాడని, దానిని గుర్తించి మానవుడు సన్మార్గంలో నడవాలని బైబిల్ మిషన్ అధ్యక్షులు రెవ.డా.ఎ.దైవారావు, సెక్రటరీ రెవ. వైబిడీ ఇమ్మానుయేలు, జాయింట్ సెక్రటరీ రెవ.జీఆర్ ఇమ్మానుయేల్ అన్నారు. మండలంలోని నాచుగుంటలో బైబిలు మిషన్ మహాసభలు రెండో రోజు కొనసాగాయి. వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి విశ్వాసులు భారీగా తరలివచ్చారు. వీరికి బైబిల్ మిషన్ సభ్యులు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ మహాసభల్లో వారు మాట్లాడుతూ క్రీస్తు రెండో రాకడ సమీపంగా ఉందన్నారు. బైబిలు మిషన్ సేవలను ఉజ్జీవింప చేసి అనేక ప్రాంతాలకు విస్తరించే క్రమంలో బైబిల్ మిషన్ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలు క్రీస్తు రెండో రాకకు సూచన అని తెలిపారు. ఈ సందర్భంగా క్రీస్తు రెండో రాక కోసం విశ్వాసులు ఏ విధంగా సన్నద్ధమవ్వాలో తెలియజేశారు. కార్యక్రమంలో రెవ. డా. పి.సంజీవ రావు, ఎ.జాన్సన్ జాసువా, ఎ.దేవదాస్, జె.అగ్రిప్పరాజు, ఎ.ప్రిన్స్ జాన్ వినయ్, రెవ. ఎ.డైమండ్సన్, పాస్టర్ జి.జాన్‌మోజెస్‌దాస్, రెవ.ఎ.జాన్‌గోరియస్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. వెంకన్న కల్యాణోత్సవం



సుప్రభాత సేవలో పాల్గొన్న టీటీడీ బోర్డు సభ్యులు గాదిరాజు, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: మండలపర్రులో ఆదివారం నిర్వహించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. టీటీడీ పాలకమండలి సభ్యులు గాదిరాజు వెంకట సుబ్బరాజు, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దంపతులు శ్రీవారు, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. టీటీడీ వేద పండితులు, ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాకంకణధారణ, అగ్నిప్రతిష్టాపన, మహా సంకల్పం, మంగళ సూత్రధారణ ఘట్టాలతో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం నక్షత్రహారతి, మంగళహారతులతో కల్యాణం దిగ్విజయంగా ముగిసింది. గణపవరం, నిడమర్రు మండలాల నుంచి భక్తులు వేలాదిగా హాజరై కల్యాణ వెంకటేశ్వరుడిని దర్శించుకుని ఆధ్యాత్మిక ఆనందడోలికల్లో ఓలలాడారు. గోవింద నామ స్మరణతో పులకింతులయ్యారు. ఉదయం సుప్రభాతం, తోమాలసేవ, కొలువు, అర్చన, టీటీడీ దేవస్థానంలో నిత్యం నిర్వహించే పూజలు జరిగాయి. కొలువు సహస్రనామార్చన, స్నాపనం, తిరుమంజన సేవ, ఉస్తవర్ల సమర్పణ, అన్నమయ్యాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ బ్రహ్మశ్రీ ఆకెళ్ల విభీషణశర్మ ప్రవచనాలు, దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి బ్రహ్మశ్రీ పగడాల ఆనందతీర్థాచార్యులు ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 30 వేల మంది స్వామి వారి పూజల్లో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. టీడీడీ బోర్డు సభ్యులు నెరుసు సత్యంబాబు, మేకా శేషుబాబు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, పౌరసరఫరా శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తదితరులు ఈ పూజల్లో పాల్గున్నారు.

సౌత్ జోన్ యోగా పోటీల్లో కార్తీక ప్రతిభ



సర్టిఫికెట్ అందుకుంటున్న కార్తీక ఉషా

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ సౌత్ జోన్ ఆర్టిస్టిక్ సోల్ ఈవెంట్ యోగా పోటీలు శని, ఆదివారం రెండు రోజుల పాటు తమిళనాడులోని దిండిగల్‌లో జరిగాయి. ఈ పోటీల్లో 18 సంవత్సరాల పైన కేటగిరిలో పశ్చిమ గోదావరి జిల్లా తణుకు చెందిన కె.కార్తీక ఉషా శ్రీదుర్గ మూడో స్థానం సాధించారు. ఏపీ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాల నుంచి 650 మంది మహిళలు, బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఎ.రాధిక, కరిబండి రామకృష్ణ, కోచ్ ఎ.భవానీ తదితరులు కార్తీక ఉషాను అభినందించారు.

నాణ్యమైన దాణాతో లాభాలెన్నో

- పశువుల్లో పునరుత్పత్తి సామర్థ్యం పెంపు
- మెరుగుపడనున్న పాల దిగుబడి
- సకాలంలో ఎదకు వచ్చే అవకాశం

పాడి - పంట



పాడి పశువులు

చింతలపూడి: పాడి పశువులకు నాణ్యమైన దాణాను అందించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దీని వల్ల పశువుల్లో పునరుత్పత్తి సామర్థ్యం మెరుగుపడటమే కాక పాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. సాధారణంగా పాడి పశువుల్లో విటమిన్-ఎ, కాల్షియం, ఫాస్పరస్ వంటి పోషక పదార్థాలు లోపం వల్ల పునరుత్పత్తి సామర్థ్యం తగ్గుతుంది. చాలా మంది రైతులు వర్షాకాలం, చలి కాలంలో పచ్చిమేతలు, ఎండాకాలంలో ఎండు గడ్డిని పాడి పశువులకు దాణాగా అందిస్తారు. అయితే ఇది సరైన పద్ధతి కాదని, పచ్చిమేత ఎక్కువగా దొరికే వర్షాకాలంలో పాతర వేసి నిల్వ చేసుకోవడం ద్వారా అన్ని కాలాల్లో పచ్చిమేత అందుబాటులో ఉండేలా చూసుకోవాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.లింగయ్య రైతులకు చెబుతున్నారు. ఆయన ఇంకా ఏం సూచనలు చేశారంటే..

ఎంత మేత పెట్టాలి


రోజూ ఒక్కో పశువుకు ఎనిమిది కిలోల వరిగడ్డి, లేదా ఎండు చొప్ప (మొక్కజొన్న, జొన్న), ఎనిమిది కిలోల లెగ్యూమ్ జాతి పచ్చిమేత (పిల్లిపెసర, అలసంద, గోరు చిక్కుడు), 16 కిలోల గింజ జాతి పచ్చి మేతలు ఇచ్చినట్లయితే పశువులకు అన్ని రకాల పోషకాలు అందుతాయి. పాల దిగుబడిని బట్టి పశువులకు దాణా అందించాలి. ఈ విధంగా పశుపోషణ చేస్తే సకాలంలో ఎదకు వస్తాయి, పాల ఉత్పత్తి కూడా అధికంగా ఉంటుంది.

గొడ్డుమోతు సమస్య.. నివారణ

పశువుల్లో గొడ్డుమోతు సమస్యకు కారణం సకాలంలో ఎదకు రాకపోవడం, గర్భకోశ వ్యాధులు ఉండటం, అండంలో లోపాలే. పశువులు ఈనిన తరువాత 60 నుంచి 90 రోజుల్లో ఎదకు వచ్చి చూలు కట్టాలి. ఎదకు రాని పశువులను సకాలంలో పశు వైద్యుడి వద్దకు తీసుకువెళ్లి పరీక్ష చేయించాలి. ప్రతి రోజు ఎద లక్షణాలను పరిశీలించి కృత్రిమ గర్భధారణ చేయించాలి.

దూడల్ని ఎదగనీయాలి

యుక్త వయసు రాని దూడల్ని కృత్రిమంగా పొర్లించి చూడి కట్టించే విధానాన్ని రైతులు విడనాడాలి. తగిన వయసు, బరువు లేని పశువుల్ని చూడి కట్టించడం వల్ల పశువుల్లో వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ. ఆవులకు 18 నెలలు, గేదెలకు 24 నెలల వయసు వచ్చిన తరువాత మాత్రమే చూడి కట్టించాలి. ఆవులు 200 కిలోలు, గేదెలు 250–300 కిలోల బరువు ఉన్నప్పుడు మాత్రమే చూడి కట్టించాలి. శారీరకంగా పూర్తిగా ఎదగని పశువులను చూడి కట్టించడం వల్ల కటి వలయం సరైన రీతిలో నిర్మాణం కాక ఈనిక కష్టతరమవుతుంది. దీని వల్ల ఈనిక సమయంలో ఒక్కోసారి తల్లి లేదా దూడ లేదా రెండూ మరణించే ప్రమాదం ఉంది. అందు వల్ల రైతులు ఇటువంటి అశాస్త్రీయమైన పద్ధతులకు స్వస్తి పలికితే పాడి పశువులు ఆరోగ్యంగా ఉంటాయి.



డాక్టర్ కె.లింగయ్య, ఏడీ, పశుసంవర్ధక శాఖ

క్లుప్తంగా

నేటి నుంచి వికసిత్ భారత్ యాత్ర

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలోని పలు వార్డుల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ఈనెల 29వతేదీ సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పట్టణంలో వరుసగా మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు.

వైభవంగా మర్లమ్మ జాతర



మర్లమ్మ జాతరలో పాల్గొన్న భక్తులు.

ఆకివీడు: మండలంలోని సిద్దాపురం శివారు నందమిల్లిపాడు గ్రామంలో ఆదివారం గ్రామ దేవత జాతరను జరుపుకున్నారు. జాతరలో కేరళ డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాలు, బొమ్మలాటలు, సన్నాయి మేళాలతో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. జాతర కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొర్ల శివ, చినమిల్లి పెంటయ్య, అడ్డాల వాసు, నందూరి శ్రీను,పసుపులేటి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భావ ప్రచార పరిషత్ భక్తి సమ్మేళనం



భక్తి సమ్మేళనంలో పాల్గొన్న పెద్దలు

కాళ్ల: రామకృష్ణ సేవా సమితి వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో ప్రాతళ్లమెరక గ్రామంలో మంద్యాంధ్ర రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ భక్త సమ్మేళనం కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. వేగిరాజు శివ వర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమాల్లో పలువురు స్వాములు ప్రసంగించారు. శితికంఠానందాజీ, వావిలాల వెంకట రామకృష్ణ శాస్త్రి, నాయిని జ్యోత్స్న, గంగవరం శ్రీదేవి, వినీచితనంద స్వామీజీ, భవాని ప్రాణమాతాజీ, ధర్మాత్మ ప్రాణమాతాజీ ఆధ్యాత్మిక ప్రవచనాలు తెలియజేశారు. చివరి రోజు కావడంతో పెద్ద ఎత్తున భక్తులు ప్రవచనాలు వినేందుకు తరలివచ్చారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ ఈఓకు సన్మానం



ఈఓ సూర్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రేపాక వారి సత్రం ఫౌండర్ ఛైర్మన్ రేపాక వీర్రాజు, ఆలయ సూపరింటెండెంట్ మెండెం స్వామి, అన్నదాన కమిటీ సభ్యులు జంధ్యం ఉప్పురి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బల్ల పూజలు

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరు, గవరపేట రజక జన సంఘీయులు సంయుక్తంగా ఆదివారం బల్లపూజలు జరుపుకున్నారు. సంక్రాంతి రోజున బల్లకు పూజలు చేసి బట్టలు ఉతకడం నిలుపుదల చేశారు. ప్రతి రోజూ బల్లకు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. ఆదివారం గవరపేట, దగ్గులూరు గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో మంగళవాయిద్యాలతో పెద్దలు, మహిళలు, చిన్నారులు పాల్గొని బల్లలకు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. సంఘ అధ్యక్షుడు ఆదుర్తి శివరావు, ఉపాధ్యక్షుడు దేవాడ నీల వెంకటేశ్వరరావు, అంతర్వేదిపాలెం చాముండేశ్వరరావు, లంక నరసింహమూర్తి, పాలిమేర సాయి, దేవాడ లక్ష్మణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి అండ ‘వైఎస్సార్ ఆరోగ్యశ్రీ’

- 3,257 వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత చికిత్స
- ఏడాదికి రూ.5లక్షల నుంచి రూ.25లక్షలకు పరిమితి పెంపు
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ క్యాబిన్

తణుకు అర్బన్: పేదోడి అనారోగ్య సమస్యలకు ఖరీదైన వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 5 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచడంపై ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహానేత వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం గతనెల వరకు కుటుంబానికి రూ. 5లక్షలు చొప్పున అమల్లో ఉండగా ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాజాగా ఐదింతలుగా రూ. 25 లక్షలకు పెంచి గత నెల 19వ తేదీ నుంచి అమల్లోకి తీసుకువచ్చారు. దీంతో క్యాన్సర్ లాంటి ఖరీదైన రోగంతోపాటు గుండె జబ్బులకు సంబంధించి కూడా ఆరోగ్యశ్రీలో పూర్తిస్థాయిలో ఉచిత వైద్యం పొందే వెసులుబాటు కలిగింది. ఇందుకు సంబంధించి లబ్ధిదారులకు నూతనంగా అందుబాటులోకి వచ్చిన కార్డులను సైతం వలంటీరు వ్యవస్థ ద్వారా ఇంటి గుమ్మంలోకి అందజేశారు. ఈ పథకం పూర్తిస్థాయిలో అమలయ్యేందుకు ఆరోగ్యశ్రీ విభాగ అధికారయంత్రాంగం సైతం తీవ్రంగా కృషి చేస్తోంది. ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల్లో రోగులకు ఆరోగ్యమిత్రల ద్వారా నాణ్యమైన సేవలందుతున్నాయి.

టీడీపీ నిర్వీర్యం చేసింది..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పథకానికి తూట్లు పొడిచారు. ప్రభుత్వం నుంచి సరిగా బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో స్థానికంగా వైద్యం అందక బాధితులు ఇతర రాష్ట్రానికి వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి ఉండేది. ఆరోగ్యశ్రీ డబ్బులు సరిపోలేదంటూ ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగుల నుంచి డబ్బు గుంజేసే పరిస్థితి గతంలో ఉండేది. అంతేకాకుండా ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తరువాత వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి విశ్రాంత సమయంలో జీవనోపాధి కోసం రోజుకు రూ. 225ల నుంచి శస్త్రచికిత్సను బట్టి గరిష్ఠంగా రూ. 5వేలు వరకు వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం ద్వారా అందచేస్తున్నారు.

తణుకులో 7 ఆస్పత్రుల ద్వారా వైద్యం..

తణుకు నియోజకవర్గంలో పట్టణం, తణుకు, అత్తి లి, ఇరగవరం మండలాలకు సంబంధించి మొత్తం 48,032 ఆరోగ్యశ్రీ కార్డులు ఉండగా తణుకు పట్టణంలో ఉన్న జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు మరొక 6 ప్రైవేటు ఆస్పత్రుల ద్వారా ఉచిత వైద్యసేవలు అందుతున్నాయి. గుండె, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, కంటి, పళ్లు, న్యూరాలజీ, యూరాలజీ, జనరల్ సర్జరీలు, జనరల్ మెడిసిన్, ప్రసూతి వంటి సేవలు ఉచిత అడ్మిషన్‌తో అవసరమైన శస్త్రచికిత్సలు, ఉచిత మందులు రోగులకు అందుతున్నాయి.

పేదోడికి అండగా ఆరోగ్యశ్రీ



పేదోడి ఆరోగ్యానికి అండగా నిలబడాలనే ఉద్దేశ్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచారు. అనారోగ్యాలతోపాటు సుదీర్ఘ కాలం ఏడిపించే వ్యాధులను దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచారు. ముఖ్యంగా కిడ్నీ, క్యాన్సర్ వంటి ఖరీదైన జబ్బులకు సంబంధించి ఆరోగ్యశ్రీ పరిమితి సరిపోవడంలేదనే ఉద్దేశ్యంతో ఈ నూతన కేటాయింపులు సీఎం జగన్ చేశారు. ఇచ్చిన హామీలు ఇప్పటికే నెరవేర్చగా ఇవ్వని హామీలు సైతం నెరవేర్చే మనసున్న మారాజు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి

ఆరోగ్యశ్రీ నా ప్రాణాలు కాపాడింది



మూడేళ్ల క్రితం గుండెనొప్పి రావడంతో ఆస్పత్రిలో చూపించుకున్నాను. వైద్యులు అర్జెంటుగా ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలని చెప్పారు. రాజమండ్రిలోని బొల్లినేని హాస్పటల్‌లో ఒక్క రూపాయికూడా తీసుకోకుండా ఆరోగ్యశ్రీలో ఉచితంగా ఆపరేషన్ చేశారు. ఇప్పుడు నాకు ఎటువంటి అనారోగ్య సమస్యలులేవు. ఆరోగ్యశ్రీ ఉంది కాబట్టి వైద్యం చేయించుకోగలిగాను.

– శీలబోయిన గోవిందరాజు, తణుకు

ఆరోగ్యశ్రీ ఆదుకుంది



మా అత్తమ్మకు ఫైల్స్ వ్యాధి రావడంతో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వైద్యుడికి చూపించాను. ఆరోగ్యశ్రీలో పెట్టి ఉచితంగా ఆపరేషన్ చేశారు. అంతే కాదు ఇంటికి వెళ్లేప్పుడు డబ్బులు కూడా ఇస్తామని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం మాలాంటి పేద వారికి అండగా నిలబడింది.

– ఐ.మారతమ్మ, ఖండవల్లి

ప్రసవాన్ని కూడా ఆరోగ్యశ్రీలో చేర్చారు



నాకు తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రెండో ప్రసవం జరిగింది. గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు ప్రసవాలు కూడా ఆరోగ్యశ్రీ పథకం చేర్చి ఉచితంగా చేయడమే కాకుండా ఇంటికి వెళ్లేప్పుడు వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం ద్వారా డబ్బులు ఇస్తున్నారు. మొదటి కాన్పులో రూ. 4వేలు రాగా, ఇప్పుడు రెండో కాన్పులో రూ. 5 వేలు ఇచ్చారు.

– ఎం.కృష్ణవేణి, సూరంపూడి

రైలు ప్రయాణికులకు అవగాహన



రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న రైల్వే ఎస్‌ఐ హరిబాబు

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు ఆదివారం జీఆర్‌పీ ఎస్‌ఐ హరిబాబు ఆధ్వర్యంలో బృందం అవగాహన కల్పించింది. రైలు ప్రయాణాల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలు, రైలు బండిలో తరలించకూడనివి, దొంగతనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవసరమైన వేళల్లో తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. గంజాయి, మద్యం వంటివి తీసుకెళ్లడం నేరమని, ఈ విషయాల్లో ప్రయాణికులు అధికారులకు సహకరించాలని కోరారు.

మావుళ్లమ్మను దర్శించుకున్న కలెక్టర్



కలెక్టర్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): శ్రీ మావుళ్లమ్మ అమ్మవారిని జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కలెక్టర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు ఆలయ సహాయ కమిషనర్ భద్రాజీ, ధర్మకర్తలు శేషవస్త్రాలు అందజేసి, అమ్మవారి ప్రసాదాలు , చిత్రపటాన్ని అందించారు.

మేలు చేస్తున్నారు.. మళ్లీ ఆశీర్వదించండి

- రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- వేల్పూరు, మండపాకలో కొనసాగుతున్న ప్రజాదీవెన యాత్ర



వేల్పూరులో ప్రజా దీవెన పాదయాత్ర చేస్తున్న రాష్ట్ర పౌర సరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: పలు సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి మేలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో మరో ఆశీర్వదించాలని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. ఆదివారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో నిర్వహించిన ప్రజా దీవెన పాదయాత్ర, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో భాగంగా గ్రామంలో ప్రజలను ఉద్దేశించి మంత్రి కారుమూరి మాట్లాడారు. దేశంలో ఏరాష్ట్రంలో కూడా అందించలేని సంక్షేమ, అభివృద్ధి పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారని చెప్పారు. విద్యా రంగంలో ఏపీ నెంబర్ వన్ నిలిచిందన్నారు. వేల్పూరు గ్రామంలో రూ. 6 కోట్ల నిధులతో 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తే గ్రామంలోని పెత్తందార్లు, టీడీపీ నాయకులు కోర్టుకెళ్లి ఆస్పత్రి నిర్మాణాన్ని అడ్డుకున్నారని చెప్పారు. పేదలకు మెరుగైన వైద్యం అందకుండా ప్రతిపక్ష పార్టీలు కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. గత టీడీపీ పాలనలో వేల్పూరు గ్రామంలో రూ. 36 కోట్ల అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తే, గత నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రూ. 158 కోట్ల విలువైన అభివృద్ధి సంక్షేమ పథకాలను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు ఏఎంసీ ఛైర్మన్ నత్తా కృష్ణవేణి, అత్తిలి ఏఎంసీ ఛైర్మన్ బీ భరణీ ప్రసాద్, తణుకు, అత్తిలి మండల పార్టీ అధ్యక్షులు బోడపాటి వీర్రాజు, పైబోయిన సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గ ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఉండవల్లి జానకి, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మహిళా అధ్యక్షురాలు కనకదుర్గ, వైఎస్ ఎంపీపీ శేషుకుమారి, ఎంపీటీసీ సభ్యులు చుండ్రు శ్యామల, విజయ దుర్గ, వెంకట దుర్గ, సుజాత, ఏఎంసీ డైరెక్టర్ బండి పార్వతి, తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్, ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, వీఆర్‌వోలు, సిబ్బందితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం చేరువ



మండపాకలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి కారుమూరి

తణుకు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. తణుకు రూరల్ మండలం మండపాకలో ఆదివారం నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని తెలిపారు. గ్రామంలోనే అన్ని సేవలు అందించేలా ముఖ్యమంత్రి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేశారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగేవారని, ఇప్పుడు గ్రామంలోనే సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లు గడప వద్దకు అవసరమైన పథకాలు, సేవలను అందిస్తున్నారని చెప్పారు. గత టీడీపీ హయాంలో మండపాక గ్రామంలో రూ. 13 కోట్లు మాత్రమే సంక్షేమ, అభివృద్ధి పనులు చేశారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో నాలుగున్నరేళ్లలో రూ.75 కోట్ల 85 లక్షల విలువైన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించామన్నారు. రాబోయే ఎన్నికల్లో దోపీడీదారులు, పెత్తందారు వైపు కాకుండా ప్రజల సంక్షేమ కోరే జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలోని యల్లారమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

కల్లుగీత సంఘం మహాసభలు విజయవంతం చేయాలి



తణుకులో మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

తణుకు: ఆంధ్రప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర 15వ మహాసభలు ఈనెల 30, 31వ తేదిల్లో తణుకు పట్టణంలో జరుగుతున్నాయని రాష్ట్ర అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి తెలియజేశారు. ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్‌లో ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కామన మునిస్వామి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ ఈ మహాసభలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, 30వ తేదిన మోకులు, ముస్తాదులు ధరించి గీత కార్మికుల మహాప్రదర్శన మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమై లయన్స్ క్లబ్ ఆడిటోరియం వద్దకు చేరుతుందన్నారు. ప్రదర్శన అనంతరం సంఘం ఏర్పడి 80 వసంతాలు అయిన సందర్భంగా సభ జరుగుతుందన్నారు. ఈ సభకు ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణ, వృత్తి సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య తదితర నాయకులు పాల్గొంటారన్నారు. 31న 20 జిల్లాల నుంచి అనుభవజ్ఞులైన రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు, సొసైటీల అధ్యక్షులు, 300 మంది పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు గుబ్బల రాఘవులు, మామిడిశెట్టి నాగభూషణం పాల్గొన్నారు.

రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధం



అప్పారావుపేట కృషి అమృత భారతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ సమావేశ దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: రైతాంగానికి అవసరమైన ఎరువులు, పురుగు మందులు సిద్ధంగా ఉన్నాయని కృషి అమృత భారతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ జాతీయ ఇన్‌చార్జ్ జలగం కుమారస్వామి అన్నారు. ఆదివారం మండలంలోని అప్పారావుపేట గ్రామంలో కృషి అమృత భారతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ తాడేపల్లిగూడెం మండల తొలి సమావేశం అధ్యక్షుడు కొండపల్లి నగేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పది వేల ఎఫ్‌పీవోలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ ఎఫ్‌పీవోల ద్వారా రైతాంగానికి లాభం చేకూర్చేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. కృషి అమృత భారత రైతు ఉత్పత్తిదారుల సంస్థ తాడేపల్లిగూడెం మండల అధ్యక్షుడు కొండపల్లి నగేష్ మాట్లాడుతూ ప్రస్తుతం ఖోఖో వంటి ఉత్పత్తులను మధ్య దళారీ వ్యవస్థ లేకుండా కొనుగోలు చేసి, ఫ్యాక్టరీలకు తరలించడం జరుగుతుందన్నారు. ఈ సంస్థలో సభ్యులుగా చేరిన వారందరికీ మేలు చేకూరేలా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి శ్రీనివాస్, కోట రాంబాబు, సంస్థ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

నాగబాబు ఆధ్యాత్మిక సేవలు ప్రశంసనీయం



వెంకట్రామన్నగూడెం గ్రామంలో మాట్లాడుతున్న నాగబాబు

తాడేపల్లిగూడెం రూరల్: ఏటా శ్రీదేవీ మహంకాళమ్మ వారి ఉత్సవాలను నిర్వహిస్తూ యువతలో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందిస్తున్న నాగబాబు సేవలు ప్రశంసనీయమని కౌన్సిలర్ చాంబర్ మాజీ చైర్మన్ గొరకపూడి చిన్నయ్య దొర అన్నారు. ఆదివారం మండలంలోని వెంకట్రామన్నగూడెం వ్యవసాయ క్షేత్రంలో నవోదయ ఫ్రెండ్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్య దొర మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం చిన్నయ్యదొర, పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ మురళీకృష్ణంరాజు, రామగాని శ్రీనివాస్‌లు నాగబాబును సత్కరించారు. నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

వైభవంగా గుర్రంపై గంధం ఊరేగింపు



జగన్నాథపురం గ్రామంలో గుర్రంపై గంధం ఊరేగింపు మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం హజరత్ కాలే మస్తాన్ షా ఔలియా (దర్గా)లో 107వ ఉరుసు మహోత్సవంలో భాగంగా గుర్రంపై గంధం ఊరేగింపు కార్యక్రమం శనివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. తొలుత దర్గా పోషకురాలు అబ్బిన నాగమణి నివాసం నుంచి ఊరేగింపు ప్రారంభమైంది. గ్రామంలోని పలు వీధుల్లో ఈ ఊరేగింపు సాగింది. అనంతరం ఊరేగింపు దర్గాకు చేరుకుంది. ఈ సందర్భంగా గుర్రంపై తెచ్చిన గంధాన్ని మసీదులో ఉంచారు. ఆదివారం మసీదు వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి విజేతలకు బహుమతి ప్రదానం, గంధాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పాతూరి రామ్‌ప్రసాద్ చౌదరి, దర్గా పోషకురాలి కుటుంబ సభ్యులు అబ్బిన రాజీవ్ చౌదరి, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటు విలువ తెలియక చాలా మంది ఓటును వేయడం నిర్లక్ష్యం చేస్తున్నారని, ఓటు వజ్రాయుధమని, ఓటును వేయడంలో నిర్లక్ష్యం వద్దని భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ మేనేజర్ కే శ్రీనివాస్ అన్నారు. భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ అవరణలో ప్రయాణికులతో ఓటు హక్కు ప్రాముఖ్యత – వినియోగం అనే అంశంపై అవగాహన, ప్రయాణికుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని రెవెన్యూ శాఖ, శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటును సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రయాణికులు కొలసు ప్రభావతి (గుంటూరు), ఆర్ సూర్యకాంతం (విజయవాడ), వి రాజబాబు (గుడివాడ) మాట్లాడుతూ సుస్థిర పాలకులను ఎన్నుకోవడానికి ఓటు వజ్రాయుధమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ఓటర్ చైతన్య ప్రతిజ్ఞ నిర్వహించి ఓటర్‌గా నీ కర్తవ్యం విస్మరించరాదని, ఓటు కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా వేయడానికి వేయించడానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో రైల్వే సూపర్ వైజర్ ఎస్.రాము, ఎస్‌కే చాన్ భాషా, మల్లుల సీతారాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మహాత్మాగాంధీ వర్ధంతి పక్షోత్సవాలు



క్విట్ ఇండియా స్థూపం వద్ద బ్రోచర్‌ను అవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీవిజ్ఞానవేదిక, సెయింట్ మేరీస్, కుష్టు వ్యాధి నివారణ కేంద్రం, క్విట్ ఇండియా స్థూప నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు మహాత్మాగాంధీ వర్ధంతి పక్షోత్సవాలను భీమవరంలో నిర్వహిస్తున్నామని నిర్వాహక సభ్యులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, బోండా సుబ్బారావు, అరసవల్లి సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక క్విట్ ఇండియా స్థూపం వద్ద మహాత్మాగాంధీ వర్ధంతి పక్షోత్సవాల బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలతో అన్ని ప్రాంతాల్లోనూ సదస్సులు, అంటరానితనం నిర్మూలన ర్యాలీలు, విద్యార్థులకు వివిధ రకాల పోటీలు, జతికులమత రహితంగా అందరితో కలిసి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాద్ రాజు, ఎస్ కే చాన్ భాషా, షేక్ బాబాజీ సాహెబ్, పి.అమూల్యా రావు, వారణాసి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవనంలో ధ్యానం భాగం కావాలి



సాంబశివరావును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆకివీడు: ప్రతి వ్యక్తి జీవనంలో ధ్యానం ఒక భాగం కావాలని ధ్యానరత్న, డాక్టర్ ఉండ్రమట్ల సాంబశివరావు పిలుపునిచ్చారు. ధ్యానంలో విశిష్ట సేవలందించిన తనకు అపూర్వమైన డాక్టరేట్ అవార్డును యునైటెడ్ థియోలాజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ ద్వారా పొందడంతో తన జన్మ ధన్యమైందన్నారు. స్థానిక షాదీఖానలో ఆదివారం ఈ సందర్భంగా పలువురు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఏఎంసీ చైర్మన్ వానపల్లి బాబూరావు మాట్లాడుతూ ఎన్నో సభలు, సమావేశాలు, శిక్షణా తరగతుల ద్వారా ధ్యానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి వారి ఆరోగ్యం కుదుటపడే విధంగా సాంబశివరావు కృషి చేశారన్నారు. లయన్స్ ప్రతినిధి జుంగా దాస్, సీఐ సత్యనారాయణ, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, జగ్గురోతు విజయ్‌కుమార్, అంబటి రమేష్, పుప్పాల పండు, ఎండీ.జక్కీ,గుండుగొలను సావిత్రి, గొంట్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో భీమవరం డివిజన్ జట్టు విజయం

భీమవరం: భీమవరం, నరసాపురం డివిజన్లలోని వివిధ పోలీస్ స్టేషన్ల మధ్య నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్‌లో నరసాపురం డివిజన్ జట్టుపై భీమవరం డివిజన్ జట్టు విజయం సాధించింది. భీమవరంలోని డీఎన్నార్ కళాశాల గన్నాబత్తుల వారి క్రీడామైదానంలో ఈ పోటీలు నిర్వహించారు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భీమవరం డివిజన్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 105 పరుగులు చేయగా, ఛేదనలో నర్సాపురం డివిజన్ జట్టు 79 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇరుజట్లలోని ఆటగాళ్లను డీఎస్పీ బి.శ్రీనాథ్ అభినందించారు.